క్లుప్తంగా

గడువు పొడిగింపు

సిరిసిల్లకల్చరల్: పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వం మరోసారి వెసులుబాటు కల్పించింది. జనవరి 31తో ముగిసిన గడువు మార్చి 31 వరకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు పెరిగిన గడువు లోపు దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలు సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని ఎస్సీ అభివృద్ధి అధికారి బి. వినోద్‌కుమార్ తెలిపారు.

పంటల పరిశీలన



వరి పంట పరిశీలిస్తున్న ఏఈఓ రజిత

బోయినపల్లి: మండలంలోని మర్లపేట, విలాసాగర్ గ్రామాల్లో వరి పొలాలను ఏఈఓ రజిత శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మొగిపురుగు, జింక్ లోపం నివారణ చర్యలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

సోలార్ ఫెన్సింగ్ ప్రారంభం



గంభీరావుపేట: మండలంలోని రాజేశ్వర్‌రావు నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోలార్ ఫెన్సింగ్ పనులు పూర్తయ్యాయి. ఎంపీటీసీ అంజిరెడ్డి సోలార్ ఫెన్సింగ్ కోసం రూ. లక్షా 50 వేలు మంజూరు చేయించారు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం సోలార్ పరికరాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోత్ వర్జున్ నాయక్, కో ఆప్షన్ సభ్యుడు పిట్ల బాబు కలిసి ప్రారంభించారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారంకు చెందిన మాజీ సర్పంచ్ భూక్య శంకర్ నాయక్ కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు.హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ తర్వాత ఇంటికి రాగా శుక్రవారం పరామర్శించారు. ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయనవెంట సెస్ డైరెక్టర్ కృష్ణహరి, రాజారాం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న ముదిరాజ్ యూత్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన అనుప రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాజు కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు గ్రామానికి చెందిన ముదిరాజ్ యువజన సంఘం సభ్యులు రూ.5వేలు, 50 కిలోలు బియ్యం అందించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ రాజు మృతి తీరని లోటు అని, వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు దాతలు ముందుకురావాలని కోరారు. రాజుకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, వారి విద్య, పోషణ కోసం దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. యూత్ సభ్యులు జెల్ల శ్రీనివాస్, జెల్ల రవి, జెల్ల రఘు, దుమాల దేవయ్య, అనుప పర్శరాములు, జెల్ల గణేష్, ఎల్లవేని అనిల్, దండు కిషన్, దండు అంజయ్య, జెల్ల రాయనర్సు, బాలనర్సయ్య, పూదరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కోనరావుపేట: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ద్వితీయ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎంఈవో దూస రఘుపతి అన్నారు. మండలంలోని కొలనూర్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు నూగూరి దేవేందర్, ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయుడు కోడూరి ఎలయ్య, టీపీటీఎఫ్ బాధ్యులు నరేందర్, ఉపాధ్యాయులు శ్రీపతి శ్రీనివాస్, జిందం అశోక్, రవీంద్రబాబు, రవీందర్, ఆస్మాబేగం, కమల్‌నయన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీరువా అందజేత

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న కమల్‌నయన్ శుక్రవారం బీరువా అందజేశారు. పాఠశాల అవసరాల కోసం రూ.7 వేల విలువైన బీరువా అందజేసిన ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమీపిస్తున్న జాతర.. | పనులు నత్తనడకన



మామిడిపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయం



చదును చేసి వదిలేసిన ఘాట్‌రోడ్డు

- మామిడిపల్లి ఆలయ అభివృద్ధికి రూ. 1.29 కోట్లు మంజూరు
- రెండేళ్లుగా సాగుతున్న పనులు
- ఈనెల 9నుంచి మాఘమాస్య జాతర ఉత్సవాలు

కోనరావుపేట: మండలంలోని ప్రముఖ దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రముఖ ఆలయంగా పేరుంది. వేములవాడ ఆలయ దత్తత దేవాలయమైన సీతారామస్వామి ఆలయంలో అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిధులు ఉన్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి ఆలయంలో మాఘమాస్య జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికీ పనులు పూర్తికాకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

రెండేళ్లుగా సాగుతున్న పనులు..

మామిడిపల్లి ఆలయంలో గుట్టపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి రూ.1.13 కోట్లు, ఆలయ ముఖద్వారం నుంచి ప్రధాన రహదారి వరకు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.13 లక్షల నిధులు మంజూరుకాగా అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు 2021 డిసెంబర్ 19న పనులు ప్రారంభించారు. ఈ పనులను 2023 మాఘమాస్య జాతర ఉత్సవాలలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ముఖద్వారం నుంచి మెయిన్‌రోడ్డు వరకు సీసీరోడ్డు పనులు పూర్తయ్యాయి. ఘాట్‌రోడ్డు పనులు మాత్రం రెండేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. గతేడాది మాఘమాస్య జాతరకే పనులు పూర్తవుతాయని అధికారులు ప్రకటించగా అప్పటికీ పనులు పూర్తికాకపోగా ఈ ఏడాది జాతర సమీపిస్తున్నా పనులు పూర్తికాలేదు.

వృద్ధులు, పిల్లలకు ఇబ్బంది



మామిడిపల్లి మండలంలో సీతారామచంద్రస్వామి ఆలయం ప్రముఖ ఆలయంగా పేరుంది. ఈ ఆలయానికి ఘాట్ రోడ్డు పనులు జరుగుతూనే ఉన్నాయి. ఈసారి జా తర ఉత్సవాలు ఈనెలలో ప్రారంభంకానున్నా యి. పలు ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

–జూకంటి మల్లేశం, మామిడిపల్లి

రెండేళ్లవుతోంది



మామిడిపల్లి ఆలయంలో పనులు ప్రారంభించి రెండేళ్లవుతోంది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం మూలంగా పనులు ముందుకుసాగడం లేదు. ఆలయంలో మాఘమాస్య జాతర, శ్రీరామనవమి, రథోత్సవం వేడుకలు ఘనంగా జరుగుతాయి. పనులు త్వరగా పూర్తిచేసి భక్తుల ఇబ్బందులు తీరాలి.

–నంద్యాదవు సాగర్, మామిడిపల్లి

నోటీసు ఇచ్చి చర్యలు

ఘాట్‌రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనికి తోడు సర్వేయర్ సమస్య కూడా ఉంది. దీంతో పనులు ఆలస్యమవుతున్నాయి. పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్‌కు నోటీస్ అందించాం. పనులు చేయకుంటే మరో సారి నోటీస్ ఇచ్చి చర్యలు తీసుకుంటాం. పనులు తొందరగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– రాంకిషన్‌రావు, ఆలయ ఏఈ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వేములవాడరూరల్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై మారుతి



రుద్రంగి జూనియర్ కళాశాలలో..

వేములవాడరూరల్: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మర్రిపల్లి కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపవద్దన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: యువకులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమాలపై హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సూర్య, కళాశాల ప్రిన్సిపాల్ పులి గంగయ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై ఎస్సై రమేశ్ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవురోజుగా ప్రకటించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): గిరిజనుల ఆరాధ్యదైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవురోజుగా ప్రకటించాలని, జయంతి ఉత్సవాలను అధికారికంగా ప్రకటించాలని ఆలిండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు అజ్మీరా భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జిల్లాకేంద్రంలో గిరిజనులకు స్థలం కేటాయించి సేవాలాల్ మహారాజ్ భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన దండు సంజయ్ స్మారకార్థం నిర్వహించిన కబడ్డీ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన దండుసంజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శుక్రవారం ఆయన జన్మదినం సందర్భంగా జిల్లాస్థాయిలో కబడ్డీపోటీలు నిర్వహించారు. స్నేహితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన చెక్కపెల్లి టీమ్‌కు రూ.10వేల నగదు, రెండోస్థానంలో నిలిచిన అనుపురం టీమ్‌కు రూ.5వేల నగదును అందజేశారు.

పొన్నంను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉండగా ఇచ్చిన హామీలను అమలుచేయని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు ఆపకపోతే ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పూర్మాని రాంలింగారెడ్డి, నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గోరుముద్ద ప్రారంభం



గొల్లపల్లిలో గోరుముద్దను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని మండలం రాచర్ల గొల్లపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రముఖ వైద్యుడు కొండ అంజనేయులుగౌడ్ ఆర్థికసాయంతో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పాక మురళిధర్ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు గోరుముద్ద కార్యక్రమాన్ని ఆంజనేయులు గౌడ్ అనే దాత రూ.10వేలు అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీకాలం ముగిసిన పాలకవర్గాలకు సన్మానం



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు



రుద్రంగి : మానాలలో

కోనరావుపేట: ఐదేళ్లపాటు సేవలందించిన పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ధర్మారంలో సర్పంచ్‌గా పనిచేసిన గున్నాల అరుణ, గొల్లపల్లి(వట్టిమల్ల)లో గోపు పర్శరాములుతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేసిన మల్టీపర్పస్ వర్కర్లను సన్మానించారు. వార్డు సభ్యులుగా పనిచేసిన తీగల వెంకన్న, బత్తుల రేఖ, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు వెంగల వెంకన్న, సిద్దంశెట్టి శ్రీనివాస్, నక్క నర్సయ్య, గంగుల ప్రశాంత్, మలయ్య, మిర్యాల్‌కార్ చంద్రమోహన్, ఆసరి లక్ష్మణ్, వెంకన్న, దుంపెట అంజయ్య, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులను శుక్రవారం గ్రామస్తులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కొండపురం బాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, కార్యదర్శి ,గ్రామస్తులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత, మనోహర్ దంపతులను జెడ్పీ హైస్కూల్ అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. మానాల మాజీ పాలకవర్గ సభ్యులను గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు సన్మానించారు.

కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులకు మొండిచేయి

కోనరావుపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తయారు చేసిన బడ్జెట్ అని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ బడ్జెట్‌తో పెట్టుబడి దారులకు తప్ప సామాన్యులకు ప్రయోజనం లేదన్నారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో కోతలు విధించారన్నారు. ఆదాయం పెరిగితే కేటాయింపులు పెంచాలి కానీ తగ్గింపులు ఏంటని ప్రశ్నించారు. నాయకులు మాసం బాబు, రంజిత్, ఒద్యారపు నిఖిల్, దొబ్బల ప్రశాంత్, రాజు, సుమన్, కార్తీక్, జీవన్, వంశీ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: సదరం శిబిరాన్ని ఈనెల 5, 15,21,27 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యశాల పర్యవేక్షణాధికారి మురళీధర్ తెలిపారు. నిర్ణీత తేదీల్లో మీసేవా కేంద్రాల్లో అర్హులైన దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్‌తోపాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి కుంటు పడనీయొద్దు

- కాంగ్రెస్ నేతల ఆరోపణలు సరికాదు
- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ పాలనలో సిరిసిల్ల పట్టణం ఎంతో అభివృద్ధి సాధించిందని..ఇదే స్ఫూర్తి పెరగాలి తప్ప కుంటుపడకుండా కాంగ్రెస్ నేతలు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. శుక్రవారం మున్సిపల్ ఆఫీస్‌లోని తన చాంబర్‌లో మాట్లాడారు. మాజీ మంత్రిగా కేటీఆర్ గతేడాది రూ. 40కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించగా ఎన్నికల కోడ్ వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో టెండర్ల పనులు మొదలు పెట్టొద్దని ఆదేశాలివ్వడం మూలంగానే సిరిసిల్లలో అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. మహిళా కాంగ్రెస్ నేతలు ఈవిషయాన్ని వక్రీకరించి తప్పంతా తమ కౌన్సిల్‌పై వేస్తూ వ్యాఖ్యలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందే గతంలో చేపట్టిన పనులకు రూ.15కోట్లు, టెండర్ పూర్తయిన మరో పనులకు రూ.40కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండగా కేవలం రూ.10కోట్లు మంజూరి చేయించి గొప్పలు చెప్పుకుంటున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ కాంగ్రెస్ నేతలను ఎద్దేవా చేశారు. పట్టణ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. సిరిసిల్లకు రావాల్సిన మొత్తం రూ. 55కోట్లు ప్రభుత్వం నుంచి వచ్చేలా కృషిచేయాలని హితవు పలికారు. కౌన్సిలర్లు అరుణ, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న నాయకులు

వేములవాడ: రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వేములవాడ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బింగి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోయినేని బాలయ్య, ఉప్పుల దేవరాజు, వరి లక్ష్మీనారాయణ, నామాల శేఖర్, సార శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యతోపాటు అన్ని జిల్లాల అధ్యక్షులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈనెల 4న వేములవాడ మున్నూరుకాపు సత్రం 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకోనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతుల గురించి అవగాహన కల్పించారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ కోసం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని, కళాశాలలో అనుభవమైన అధ్యాపకులు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, విశాలమైన తరగతి గదులు, ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డిపో ఎండీపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: బస్సుల్లో ఎక్కే విద్యార్థులపై ఆర్టీసీ సిబ్బంది అమానుషంగా ప్రవర్తిస్తున్నారని బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ తెలిపారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ..గతంలో విద్యార్థుల అవస్థలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా. అగ్రహారం వెళ్లే విద్యార్థులను ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కేందుకు అనుమతించారన్నారు. కొందరు విద్యార్థులు బస్సుకోసం వేచిచూసి ఎక్స్‌ప్రెస్ రాగానే ఎక్కడంతో ఇష్టారీతిగా మాట్లాడుతూ దింపివేశారని, ఈ విషయమై డిపో మేనేజర్‌కు విన్నవిస్తే కేసులు పెడుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అమర్యాదగా ప్రవర్తిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మట్టె శ్రీనివాస్, జగన్, నవీన్, సందీప్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న అంజాగౌడ్

ముస్తాబాద్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్, సంతోష్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, క్రాంతికుమార్, యెల్లగిరి, సంజీవ్, శంకర్, పద్మ, శ్రీకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ రూరల్ : వట్టెంలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాం రెడ్డి



ముస్తాబాద్ : బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రమాదేవి

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు

వేములవాడ రూరల్/ తంగళ్లపల్లి/రుద్రంగి/ముస్తాబాద్/గంభీరావుపేట/ కోనరావుపేట /బోయినపల్లి: గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగిసింది. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని గ్రామాలకు ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు, జీపీ మాజీ పాలకవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు రికార్డులు, సమస్యలు ఇతర వివరాలు తెలుసుకున్నారు.

సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కూతురు కరుణాకర్ రెడ్డి బదిలీపై వెళ్తుండగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. హెచ్‌ఎం నీలి శ్రీనివాస్, సంధ్యారాణి, ఉపాధ్యాయులు రవీందర్, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.